# నఖిలీ ఉజ్జీవము

(COUNTERFEIT RIVIVAL (TELUGU) - ZAC POONEN)

**జాక్ పూనెన్**

చివరి దినాలు విస్తరిస్తున్న మోసముతో మరియు అనేకులైన అబద్ధ ప్రవక్తలతో నిండి యుండునని యేసుక్రీస్తు మరియు ఆయన అపొస్తులులు మరల మరల చెప్పారు (మత్త 24:3, 11, 24; 1 తిమో 4:1). మరియు అటువంటి వాటిని మనము గత కొద్ది శతాబ్దాలుగా చాలా చూచితిమి.

లక్షల కొద్ది క్రైస్తవులు ఎందువలన ఈ అబద్ధ ప్రవక్తలు మరియు ఈ "నఖిలీ ఉజ్జీవములు" వలన ఎందుకు మోసపోవుచున్నారు? ఎందువలన అనేక మంది బోధకులు వ్యభిచారము మరియు ధన వ్యామోహములో పడిపోవుచున్నారు.

నేను చూచిన కొన్ని ముఖ్య కారణములు :

1. అనేక మంది క్రైస్తవులకు క్రొత్త నిబంధన ఏమి బోధిస్తున్నదో ఈనాడు తెలియదు. దానికి కారణం వారు దానిని జాగ్రత్తగా చదువకపోవుట; అందువలన వారు క్రొత్త నిబంధన బోధించునవి కాక వారి నాయకులు బోధించునవే అనుసరించుచున్నారు.
2. వారి యొక్క గుణగణాల కంటే (మానవతాతీతమైన జీవితము) సూచక క్రియలు (మానవాతీత వరములు) వారికి ప్రాముఖ్యముగా నున్నవి.
3. ఆత్మీయ సంపద కంటే భౌతిక సంపద ఎక్కువ ప్రాముఖ్యమగుచున్నది.
4. వారు మానసికమైన ఆవేశానికి లేక మనశ్శాస్త్రమునకు సంబంధించిన విషయములను ఉపయోగించుకొనుటకు మరియు నిజమైన పరిశుద్ధాత్మ సంచారమునకు మధ్య తేడాను గుర్తించలేకపోవుచున్నారు. దీనికి కారణము మరల క్రొత్త నిబంధన తెలియకపోవుట.
5. వారు మానసిక శాస్త్ర మూలమున కలుగు స్వస్థతకు (మనసులో మంచి వైఖరులు కలిగించుట ద్వారా కలుగ స్వస్థత) యేసు నామములో మానవాతీతముగా కలుగు స్వస్థతకు మధ్య నుండిన తేడాను గ్రహించ లేకపోవుచున్నారు.
6. భావోద్రేకములు మరియు విపరీతమైన భౌతిక ప్రదర్శనలు ప్రభువులో అంతరంగ సంతోషము కంటే ఎక్కువ ప్రాముఖ్యముగా చూచుచున్నారు.
7. నాయకులకు, దేవునితో వారియొక్క అంతరంగ నడక కంటే జనులకు చేయు పరిచర్య ఎక్కువ ప్రాముఖ్యమగుచున్నది.
8. ఈ నాయకులకు, దేవుని యొక్క ఆమోదము కంటే మనుష్యుల యొక్క ఆమోదము ఎక్కువ ప్రాముఖ్యమగుచున్నది.
9. ఈ నాయకులకు వారి కూటములకు వచ్చు జనులు దేవునికి పూర్తిగా సమర్పించుకొంటిరా? లేదా? అనుదానికంటే ఎంతమంది హాజరవుతున్నారనేదే ప్రాముఖ్యముగా నుండుచున్నది.
10. ఈ నాయకులకు ఒక స్థానిక సంఘమును నిర్మించి ఆ స్థానిక సంఘమునకు సేవకులుగా నుండుట కంటే (యిర్మియా 6:13) వారి స్వంత జాగీరులను మరియు వారి ఆర్థిక సామ్రాజ్యములను కట్టుకొనుట ఎక్కువ ప్రాముఖ్యమైనది.

ఇవన్నీ కూడా యేసుప్రభువు బోధించిన వాటికి ఎంతో వ్యతిరేకమైనవి. క్రీస్తుకు వ్యతిరేకమైనది "క్రీస్తు విరోధి" అని క్రొత్త నిబంధనలో పిలువబడినది. దీనిని క్రైస్తవులు తేటగా చూడనట్లయితే, క్రీస్తు విరోది తన యొక్క అబద్ధపు సూచక క్రియలు మరియు అద్భుతములతో లోకమును తలక్రిందులు చేయునప్పుడు (2 థెస్స 2:3-10) వారు కూడా గ్రుడ్డిగా అతడిని అంగీకరించుదురు. పైన చెప్పుకొనిన అంశములకు సంపూర్తిగా వ్యతిరేకముగా నుండుట క్రీస్తు ఆత్మతో నడిపింపబడుటగా యున్నది.

ఇక్కడ మత్తయి 7:13-27లో యేసు యొక్క మాటల సంగ్రహా రూపము (మత్తయి 5, 6,7 అధ్యాయములలో నుండిన విషయములకు అన్వయించు కొనుచు చదవండి).

"నిత్య జీవమునకు ద్వారము మరియు మార్గము రెండు కూడా చాలా ఇరుకైనవి - ఇది మత్తయి 5-7 అధ్యాయములలో చెప్పబడినది. కాని అబద్ధ ప్రవక్తలు వచ్చి నిత్య జీవము యొక్క ద్వారము మరియు మార్గము ఇరుకైనది కాదని విశాలముగా నుండునని చెప్పుదురు. వారి గూర్చి జాగ్రత్తగా నుండవలెను మరియు వారి గుణగణముల యొక్క ఫలములను జాగ్రత్తగా గమనించుట వలన

సులువుగా వారిని గుర్తించవచ్చును. వారు కోపము నుండి, స్త్రీల యెడల వ్యామోహము నుండి ధనాశ నుండి వస్తు వాహనములను ఆసక్తితో వెదుకుట నుండి (లోకస్థులు వెదికినట్లు) విడుదలైన జీవితము జీవించుచున్నారా? నేనిప్పుడు బోధించినట్లు వీటికి వ్యతిరేకముగా బోధించుచున్నారా? (మత్త 5:21-32 మరియు 6:24-34). ఈ అబద్ధపు ప్రవక్తలు నా నామములో ఎన్నో మానవాతీతమైన వరములను ప్రదర్శింతురు మరియు సూచక క్రియలు చేయుదురు మరియు నిజముగా జనులను స్వస్థపరచుదురు, కాని వారికి నన్ను (పరిశుద్ధునిగా) తెలియకపోవుటను బట్టి మరియు వారి రహస్య జీవితములలో పాపమును విడిచిపెట్టకపోవుటను బట్టి ఆ చివరి దినాన వారి నందరిని నరకమునకు పంపివేయుదును (మత్త 7:21-23). కనుక నీవు ఎప్పటికి కదలని లేక కాలము గడచిన తరువాత లేక శాశ్వతముగా పడిపోని బండపై సంఘమును కట్టవలెనంటే, నేనిప్పుడు చెప్పిన వన్నిటిని చేయుటకు జాగ్రత్త పడుము (మత్త 5 నుండి 7 అధ్యాయములు) మరియు నేను ఆజ్ఞాపించిన వన్ని నీ జనులు కూడా చేయునట్లు వారికి బోధించుము. అప్పుడు నేను నీతో ఎల్లప్పుడు యుందును మరియు నా అధికారము ఎల్లప్పుడు నీ వెన్నంటి యుండును (మత్త 28:20,18). అట్లుకాక నీవు నేను చెప్పువాటిని కేవలము విని, వాటిని చేయని యెడల, ఇప్పుడు నీవు కట్టినది మనుష్యులకు పెద్దదైన చూడచక్కని సంఘముగా నుండును, కాని అది ఒక రోజున తప్పక పడిపోయి ముక్కలగును (మత్త 7:25).

అటువంటప్పుడు మనము కదలనటువంటి సంఘమును ఈ రోజుల్లో ఎట్లు నిర్మించగలము?

1. మనము కొండమీద ప్రసంగము ప్రకారము జీవించవలెను (మత్త 5 నుండి 7 అధ్యాయములు) మరియు ఎల్లప్పుడు దానిని బోధించవలెను.

2. మనము పాత నిబంధన ప్రకారము కాక క్రొత్త నిబంధన ప్రకారము జీవించవలెను. దీనికొరకు, మనము రెండు నిబంధనల మధ్య నుండిన వ్యత్యాసమును తేటగా తెలుసుకొనవలెను (2 కొరి 3:6). మనము క్రొత్త నిబంధనను తప్పక బోధించవలెను.

బోధకులు ఏదైనా తీవ్రమైన పాపములో పడినప్పుడు, వారు పాత నిబంధనలో పాపములో పడిన పరిశుద్ధుల ఉదాహరణలు తీసుకొని వారిని వారు సమర్ధించుకొందురు. (ఆ విధముగా ఆదరణ పొందుదురు). మరియు కొంతకాలము మౌనముగా నుండిన తరువాత తిరిగి వారి పరిచర్యను కొనసాగింతురు. వారు వ్యభిచారము చేసిన దావీదు మరియు వ్యాకులత చెందిన ఏలియాలను ఉదహరించుదురు మరియు "దేవుడు వారిని తిరిగి ఉపయోగించుకొనెను" అని చెప్పుదురు. కాని జీవితాంతము వరకు విజయముతోను మరియు పవిత్రతో జీవించిన పౌలు యొక్క మాదిరిని ఉదహరింపరు.

ఈనాడు మనము అనుసరింపవలసిన మాదిరి క్రొత్త నిబంధన పరిశుద్ధులు గాని పాత నిబంధన పరిశుద్ధులు కారని ఈ బోధకులు మరియు (అనేకమంది క్రైస్తవులు) చూడరు. ఈ కృపకాలములో మనకు అధికమైన కృప యివ్వబడినది. మరియు "ఎవరికైతే ఎక్కువ ఇవ్వబడినదో వారి నుండి ఎక్కువగా అడుగుదురు" (లూకా 12:48). యేసుప్రభువు క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యుండెను. మరియు మనకు మాదిరి మరియు ఈనాటి మన విశ్వాసమునకు కర్తయై యుండెను అంతేకాని దావీదు లేక ఏలీయాల కాలము నాటి విశ్వాసమునకు కాదు. పాత నిబంధనలో పరిశుద్ధులు (హెబ్రీ 11వ అధ్యాయములో చెప్పబడిన వరుస) కు మరియు యేసుకు నుండిన తేడా, హెబ్రీ 12:1-4లో చాలా తేటగా చెప్పబడినది. కాని చాలా తక్కువ మంది దీని యొక్క యదార్థతలో జీవించుదురు. చాలా తక్కువ మంది క్రొత్తనిబంధనలో దేవుడు మన కొరకు మరి శ్రేష్ఠమైన దానిని ఏర్పాటు చేసెను" అను దానిని చూడలేదు (హెబ్రీ 11:40).

మనము జాగ్రత్త కలిగి మెళకువగా నుండక పోయినట్లయితే, సైతాను కుయుక్తి కలిగిన శత్రువు కాబట్టి మనలో ఎవరమైనా అనేక మంది బోధకులు పడిపోయిన మార్గములోనే మనమును పడిపోవచ్చును. మన యొక్క భద్రత, కేవలము క్రొత్త నిబంధన బోధకు ఉన్నది ఉన్నట్లుగా విధేయత చూపుటలో మరియు దైవికమైన నాయకత్వమునకు లోబడుటలో నున్నది ("దైవికమైన" నాయకత్వము అనగా, నేను పైన చెప్పిన వరుసలోని పది తప్పుడు విషయములలో ఒక్కటి కూడా లేనివాడని అర్థము). ఇతరులు చేసిన తప్పుల నుండి మనము నేర్చుకొనినట్లయితే, మనము ఇతరులు చేసిన తప్పులను చేయకుండా తప్పించుకొనవచ్చును.

అందులన మన ముఖములను ప్రభువు ముందు అన్నివేళలా ధూళిలో ఉంచుకొందుము - ఎందుకనగా అక్కడనే మనము యోహాను పొందినట్లు దైవికమైన ప్రత్యక్షతను పొందుదుము (ప్రక 1:17). మనలను మనము తగ్గించుకొనినట్లయితే మనము జయించువారుగా నుండుటకు కావలసిన కృపను పొందుకొందుము (1 పేతు 5:5) మరియు పరిశుద్ధాత్మ మనకు దేవుని యొక్క వాక్యములో సత్యమును చూపించినపుడు మరియు మన గూర్చిన సత్యమును మనకు చూపించినపుడు మనము సంపూర్తిగా నిజాయితీగా యుండినట్లయితే మరియు పాపమంతటిని నుండి "మనము రక్షింపబడునట్లు సత్యమును ప్రేమింతుము". ఆ విధముగా మనము మోసమంతటి నుండి దేవుని చేత కాపాడబడుదుము (2 థెస్స 2:10,11). ఆమెన్.